

వీక్లీ ఎక్స్‌ప్రెస్ తిరుచానూరు వరకే

తిరుపతికి వచ్చే వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇకపై తిరుచానూరు స్టేషన్ వరకే నడపనున్నారు. ఈ మేరకు అధికారులు నిర్ణయించారు. - 8లో



నాడు పండుగ.. నేడు దండగ

రబీ సీజన్ మొదలైంది. జిల్లాలో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం చేయూతనందించడం లేదు. - 8లో



పచ్చమూక దర్జా..

బాలాయపల్లె మండలంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారుల అండతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పాళెంపాడులో రాష్ట్ర బృందం పర్యటన



చేతి బోరు వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : మండలంలోని పాళెంపాడు గ్రామంలో బుధవారం రాష్ట్ర బృందం పర్యటించనుంది. సాక్షి పత్రికలో 'ప్రాణాపాయంలో పాళెంపాడు' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం ఈ మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ పాళెంపాడులో రాష్ట్ర బృందం పర్యటించనున్నట్లు వెల్లడించారు. కిడ్నీ వ్యాధి బారిన ప్రజలు ఎందుకు పడుతున్నారో క్షేత్రస్థాయిలో కారణాలను పరిశీలించనున్నట్లు వివరించారు.

కలెక్టర్‌కు అభినందన



కలెక్టర్‌కు స్కోచ్ అవార్డు అందిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రగిరి: స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు విజయవంతం చేసినందుకు మంగళవారం నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కలెక్టర్ వెంకటేశ్వర్ స్కోచ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

నవోదయలో ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి సిటీ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ, అర్హతలతో పాటు ఇతర వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్-నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్, లేదా 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూలో 10న జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఈనెల 10వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు పలు కంపెనీలు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధిలో అవినీతిపై పునర్విచారణ



National Commission for Scheduled Castes, Hyderabad

నెల్లూరు కలెక్టర్ ఉత్తర్వులు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతిపై పునర్విచారణకు ఆదేశిస్తూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. ఉపాధి పనుల్లో అవినీతిపై ఇటీవల చిన్నగోపవరం పంచాయతీలో చీఫ్ విజిలెన్స్ అధికారి సమగ్ర విచారణ చేశారు. 8 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అయితే డ్వామా అధికారులు మాత్రం ఆరుగురు సిబ్బందిపై కేసులు పెట్టి ఇద్దరు ఏపీఓలను తప్పించారు. ఈ వ్యవహారంలో అధికారులకు ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు నేరుగా నేషనల్ ఎస్సీ కమిషనకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని 20 పంచాయతీల్లో జరిగిన అవినీతిపై పునర్విచారణ చేపట్టాలని ఎస్సీ కమిషనర్ ఆదేశించారు. దీంతో కలెక్టర్ సైతం పూర్తిస్థాయిలో పునర్విచారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డ్వామా అధికారులు, ఉపాధి సిబ్బందిలో గుబులు మొదలైంది.

కూటమి నేతలు అంతా మాయ చేశారు. చిత్తూరు నగరానికే తలమానికమైన కట్టమంచి చెరువును కుళ్లబొడిచేశారు. పూడిక తీత పేరుతో నాలుగు నెలలపాటు ఇష్టారాజ్యంగా తవ్వేశారు. వందల ట్రిప్పుల మట్టిని ఇష్టారాజ్యంగా విక్రయించి జేబులు నింపుకున్నారు. అధికార మదంతో ఏ ఒక్కరినీ అటువైపు రానీయకుండా అడ్డుకట్ట వేశారు. తీరా స్థానికులు ఆర్టీఐకి విన్నవించడంతో టీడీపీ నాయకుల బాగోతం బయటపడింది. అసలు ఇరిగేషన్ అనుమతులే లేవని.. నిబంధనలు అస్సలే పాటించలేదని సంబంధిత అధికారులు లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఔరా..! అంటూ పలువురు కూటమి నేతల తీరును ఎండగడుతున్నారు.

- కట్టమంచి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పూడికతీత పనులు
- అడ్డగోలుగా చెరువు మట్టిని అమ్ముకున్న టీడీపీ నాయకులు
- చెరువు అక్రమాలపై ఆర్టీఐకి ఫిర్యాదు చేసిన స్థానికులు
- అనుమతులతోనే పనులు చేశామంటున్న కూటమి నేతలు
- తమ వద్ద అనుమతులే పొందలేదని తేల్చేసిన ఇరిగేషన్ అధికారులు
- బయటపడ్డ కూటమి నేతల బాగోతం



కట్టమంచి చెరువులో అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం (ఫైల్).

పూడిక తీత.. పాలకులకు మేత!

అడ్డగోలుగా తవ్వకాలు




కట్టమంచి చెరువులో మట్టి ఎత్తేయడంతో ఏర్పడ్డ గుంతలు

కట్టమంచి చెరువులో ఇరిగేషన్ అధికారుల సూచనలు, స్పష్టమైన అనుమతులతో పూడికతీత పనులు చేపట్టినట్లు గతంలో కూటమి ప్రజాప్రతినిధి వెల్లడించారు. తాజాగా ఇరిగేషన్ అధికారులు వెల్లడించిన సమాచారంతో అంతా అవాక్కయ్యా రు. కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని స్పష్టంగా తెలియజేశారు. గత రెండేళ్లుగా తమ శాఖ తరఫున ఎటువంటి తనిఖీలు చేయలేదని ఇరిగేషన్ అధికారులు వివరణ ఇచ్చారు. నెలలతరబడి సాగిన పూడికతీత పనులకు కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తేల్చేశారు. కట్టమంచి సుందరీకరణ పేరుతో టీడీపీ నాయకులు మట్టిని అక్రమంగా తరలించి దోచుకున్నట్టు స్పష్టం చేశారు.

నిజాలు ఇవే

కట్టమంచి చెరువులో మట్టితవ్వకాలకు సంబంధించి చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీఐ ద్వారా సమాచారం రాబట్టారు. అందులో ఆ వ్యక్తి అడిగిన ప్రశ్నలకు ఇరిగేషన్‌శాఖ చిత్తూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయచంద్రబాబు లిఖిత పూర్వకంగా కొన్ని విషయాలు వెల్లడించారు. అందులో కొన్ని..!

- కట్టమంచి చెరువు పై గత ఐదేళ్లుగా తమ శాఖ తరఫున ఎలాంటి తనిఖీల నివేదికలు లేవు.
- గత రెండేళ్లుగా కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు.
- కట్టమంచి చెరువుకు సంబంధించి ఇరిగేషన్‌శాఖ తరఫున మట్టి తవ్వకాలపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.
- ఆక్రమణలను తొలగించే అధికారం రెవెన్యూ శాఖకు మాత్రమే ఉంది.
- కట్టమంచి చెరువులో గత రెండేళ్లుగా ఎలాంటి ఆదాయం రాలేదు.
- నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ ఎవ్వరికీ ఎలాంటి అనుమతులు, ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు.
- కట్టమంచి చెరువులో మట్టి తవ్వకాలపై ఎలాంటి ఫిర్యాదులు అంద లేదు.



కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఇరిగేషన్ అధికారులు వెల్లడించిన లిఖిత పూర్వకమైన సమాధానం

వీటికి జవాబు ఉందా..?

- కట్టమంచి సుందరీకరణ పనులకు కూటమి నాయకులు అనుమతులు ఎవరి దగ్గర పొందారు..?
- అనుమతులు ఎవరిచ్చారు..? ఎప్పుడిచ్చారు...?
- చెరువులో ఎంత లోతుకు మట్టి తవ్వాలకు అనుమతులిచ్చారు..?
- తవ్విన మట్టిని దేనికి ఉపయోగించారు?



కట్టమంచి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఎంతో చరిత్ర కలిగిన కట్టమంచి చెరువును టీడీపీ నాయకులు గుల్లచేశారు. అధికారుల అనుమతులతో పూడికతీత పనులు చేపడుతున్నామంటూ యథేచ్ఛగా మట్టి తవ్వకాలకు పూనుకున్నారు. భారీ ప్రొక్లైనర్లు, జేసీబీలు పెట్టి కొన్ని నెలలపాటు కట్టమంచి చెరువులోని మట్టిని తవ్వి తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అలాగే టీడీపీ ప్రజాప్రతినిధి, ఓ కార్పొరేటర్ వేసిన వెంచర్లకు మట్టిని అక్రమంగా తరలించారు. దీనిపై ఏ ఒక్కరూ నోరుమెదపకుండా జాగ్రత్తపడ్డారు. అధికారులు, స్థానికులు కొందరిని లంచాలతో మేనేజ్ చేసి తమ పనికానిచ్చేశారు.

ఇన్నాళ్లు కళ్లు మూసుకున్నారా?

కట్టమంచి చెరువులో కొన్ని నెలలపాటు జరిగిన అక్రమ మట్టి తవ్వకాలపై ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. చిత్తూరు నడిబొడ్డున ఉన్న చెరువులో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతుంటే అధికారులకు చీమకుట్టినట్టూ లేదు. కళ్లెదుటే మట్టి తరలిపోతున్నా పట్టించుకోలేదు. ఇటీవల వరుసగా 'సాక్షి'లో కథనాలు వచ్చినా పెద్దగా స్పందించలేదు. అంటే అధికార పార్టీకి అమ్ముడుపోయారా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లేదా లంచాల మత్తులో కళ్లుమూసుకుని కూర్చున్నారా..? అని నిలదీస్తున్నారు. ఇప్పుడు సాఫీగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడంపై రగిలిపోతున్నారు. అత్యవసరమయ్యి.. ఎవరైనా ఒక లోడు మట్టి ఎత్తితే ఆగమేఘాల మీదొచ్చి అరెస్టులు చేయించే అధికారులు నెలల తరబడి కళ్లెదుటే మట్టి తరలుతున్నా ఎందుకు పట్టించుకోలేదని గళం ఇప్పుతున్నారు. మరి వీటికి సమాధానం ఎవరు చెబుతారో వేచి చూడాలి మరి..!

చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు, పక్కన నారాయణస్వామి తదితరులు

తిరుపతి మంగళం : 'చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు, అందుకే దళితుడిగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని వ్యాఖ్యానించారు. అందుకే అంబేడ్కర్ విగ్రహాలకు నిప్పు పెట్టినా పట్టించుకోరు.. దళితులపై దాడులు జరిగినా స్పందించరు'' అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంల దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహ దహనంపై కక్షపూరిత రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. విగ్రహం కాల్చిన దుండగులను వదిలేసి, ఫిర్యాదు చేసిన సర్పంచ్ గోవిందయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ఈ విషయంలో చిత్తూరు ఎస్పీ మాట్లాడుతూ అది స్వల్ప విషయమంటూ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. పోలీసులు కేవలం పచ్చనేతల మెప్పుకోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. డిజిటల్ బుక్‌లో దళితులకు అన్యాయం చేసిన ప్రతి ఒక్కరి పేర్లను నమోదు చేస్తామని, చట్టపరంగా శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగిన నారాయణస్వామిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపాలని అనేక కుట్రలు చేశారన్నారు. ఇప్పుడు దేవళంపేటలో సర్పంచ్ గోవిందయ్యపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత సతీష్‌నాయుడే అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టించాడని తెలిసినా పచ్చనేతల మెప్పు కోసం చిత్తూరు ఎస్పీ కుట్రపూరితంగా గోవిందయ్యపై కేసులు పెట్టారని విమర్శించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ గతంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టనీయకుండా టీడీపీ నేత సతీష్‌నాయుడు అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్యే థామస్ ఏనాడైనా దళితుల కోసం పోరాటాలు చేశారా? ఎక్కడైనా ఒక్క అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కోసం దళితుడని అని చెప్పుకునే థామస్ తిరుమలకు వెళ్లినప్పుడు క్రిస్టియన్‌గా డిక్లరేషన్ ఇవ్వడంలోనే నిజ స్వరూపం తెలుస్తోందన్నారు. అలాంటి వ్యక్తి తాను రూ. వేల కోట్లు అవినీతి చేశానంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దళితులను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అంటరానివారిగానే చూస్తున్నారన్నారు. ఈ మేరకు దళితులంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, నల్లాని బాబు, రామయ్య, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చేజర్ల మురళి పాల్గొన్నారు.

అది న్యాయవ్యవస్థపై దాడి

- సీజేఐపై దాడికి యత్నం దుర్మార్గం
- దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది
- ఎంపీ గురుమూర్తి



ఎంపీ గురుమూర్తి

తిరుపతి కల్చరల్: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి యత్నించడాన్ని భారత న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా చూడాలని ఎంపీ డాక్టర్ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాని పేర్కొన్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిందని, న్యాయం, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి భారతీయుడి మనస్సాక్షిని కదిలించిందని అన్నారు. భారత న్యాయవ్యవస్థ మన రాజ్యాంగాన్ని ప్రజలకు హక్కులను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఈ క్లిష్ట సమయంలో తాను ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయితో పాటు మొత్తం న్యాయవ్యవస్థకు మద్దతు ప్రకటిస్తున్నాని తెలిపారు. బీఆర్ గవాయి సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటూ న్యాయస్ఫూర్తిని నిలబెట్టేందుకు దేవుడు ఆయనకు మరింత శక్తి, ధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.


ముక్కంటీ.. కనవేంటి!



వాహనాలు పార్క్ చేసిన షెడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల వైఖరి సరికాదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుతో కలిసి ఆలయ సమీపంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముక్కంటీశుని సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ముందుగా నాలుగో గేట్ నుంచి వచ్చే భక్తులు ఎండలో ఇబ్బంది పడుతున్నారని కార్పెట్ వేశారని, తర్వాత రోడ్డుపై కూల్ పెయింట్ వేయించారని, అనంతరం కొబ్బరి మట్టలతో పందిరి వేశారని చివరకు రేకుల షెడ్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ పని ముందుగానే చేసి ఉండవచ్చని, కానీ కేవలం కాంట్రాక్టర్లకు నగదు దోచిపెట్టేందుకే మొత్తం వ్యవహారం నడిపించారని విమర్శించారు. అయితే భక్తుల కోసం వేసిన షెడ్లలో వాహనాలు పార్క్ చేస్తుంటే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు భక్తులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన షెడ్లు కేవలం వాహనాల పార్కింగ్‌కే ఉపయోగపడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి ఎండలో భక్తులు పడుతున్న ఇక్కట్లను గమనించాలని సూచించారు. షెడ్లలో ఎవరూ వాహనాలు పార్క్ చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

గుడి ఎనక నా సామి!



చెప్పేది శ్రీరంగనీతులు.. చేసేది మాత్రం..!

- ప్రచార యావ కోసం రెచ్చిపోతున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు
- నిత్యం దేవుడికి రాజకీయ రంగు పులమడమే ఆయన పని
- విస్తుపోతున్న భక్తులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గురివిందకు కింద నలుపు తెలియదు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు ఓ పాలక మండలి సభ్యుడు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదని అంటూనే ప్రతిదీ రాజకీయం చేస్తున్నాడు. దేవుడు సన్నిధిలో గోవిందా...! నారాయణ..! అంటూనే ఇతరులపై విషం చిమ్ముతున్నాడు. ఆఖరుకి రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన పరివట్టం వ్యవహారం కూడా ఆయన తన రాజకీయ వేదిక కింద మలిచేశారు. టీటీడీలో ఏ వివాదం తలెత్తినా తగుదునమ్మా అంటూ వకాల్తా పుచ్చుకుంటున్నాడు. పోనీ వాస్తవాలు చెబుతాడా..! అంటే అదీ లేదు. అన్నీ అసత్యాలే. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. వారికి సంబంధించిన అంశాలు అయితే మాత్రం తిరుమలను వేదికగా చేసుకొని ప్రసంగాలు దంచేస్తాడు. ఇక రోజు మార్చి రోజు దర్శనానికి వచ్చే ఆయన అయితే.. టీటీడీ చైర్మన్ ప్రాపకం కోసం ఆయన చానల్లో కనిపించడం కోసం తెగ ఆరాటపడిపోతున్నాడు. సత్యాలను వక్రీకరిస్తూ అసత్యాలను వల్లిస్తున్నాడు.

- పరివట్టం కట్టడం విషయంలో గతంలో ఏమైనా జరిగాయో లేదో పక్కన పెడితే ఇలా చేయడం బహిరంగంగా తప్పని పండితులు చెబుతున్నారు.
- అయితే సదరు సభ్యుడు తన పబ్లిసిటీ పిచ్చి కోసం టీటీడీని అడ్డంగా వాడుకుంటున్నాడు. టీటీడీలో అనేక మంది పాలకమండలి సభ్యులు ఉన్నా.. ఎవరూ తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయరు. కానీ సదరు సభ్యుడు మాత్రం శ్రీవారి ఆలయం ముందు నిత్యం రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిపోయింది. 2019 క్రితం పాలకమండలి సమావేశంలో అయితే ఏకంగా చైర్మన్ కార్యాలయంలోనే సమావేశం నిర్వహించి.. రాజకీయ ఆరోపణలు చేశారు. ఆయన తీరుపై భక్తులు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.
- హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిసి కూడా ఇలా అడ్డదిడ్డంగా మాట్లాడడంపై పలువురు భక్తులు రగిలిపోతున్నారు.

క్లుప్తంగా

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం


బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

తడ : పులికాట్ సరస్సులో ఇరకం దీవి వద్ద సోమవారం ప్రమాద వశాత్తు పడవలో నుంచి జారి పడి గల్లంతైన బాలుడు హేమరాజ్ (17) మృతదేహం మంగళవారం లభ్యమైంది. వివరాలు.. చెన్నైలోని ఎన్నూరు జార్జ కుప్పానికి చెందిన హేమరాజ్ శనివారం ఇరకంలో జరుగుతున్న తిరునాళ్ల కోసం అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. సోమవారం తాత అర్ముగంతో కలిసి పడవలో వెళుతుండగా జారి సరస్సులో పడిపోయాడు. గ్రామంలోని జాలర్లు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం బాలుడి మృతదేహం పైకి తేలడంతో ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌కు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీలో అర్హత సాధించిన నూతన టీచర్లకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపడుతున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో సూచించిన ఖాళీల మేరకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాల్లోనే వెబ్‌ఆప్షన్‌లు నమోదు చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. చిత్తూరు విద్యాశాఖలో పనిచేస్తున్న ఏడీ–2తో పాటు మరికొంత సిబ్బంది విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో గత రెండు రోజులుగా వెబ్‌కౌన్సెలింగ్ కసరత్తు చేపడుతున్నారు. బుధవారం వెబ్‌కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. 9, 10 తేదీల్లో వెబ్‌కౌన్సెలింగ్ పూర్తి చేసి ఈ నెల 13న కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా కసరత్తు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి దివ్యాంగులకు వైద్య పరిశీలన

తిరుపతి అర్బన్: దివ్యాంగులు, వ్యాధిగ్రస్తుల పింఛన్లపై బుధవారం నుంచి వైద్యులు పరిశీలన చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీఓలు, డీఎంహెచ్‌ఓ, పీసీహెచ్‌ఎస్, ఎన్టీఆర్ వైద్యసేవ కో–ఆర్డినేటర్లు, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్, శ్రీకాళహస్తి, గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్లు, డీఆర్‌డీఏ పీడీతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల తొలగింపు నోటీసు అందుకున్న వారిలో 30 రోజుల్లోపు అప్పీల్ చేసుకున్నవారిని మరోసారి వైద్యులు పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా పరిశీలనకు వచ్చేవారికి తాగునీటితోపాటు భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రికి రాలేని వ్యాధిగ్రస్తుల కోసం104, 108 వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో సచివాలయ ఉద్యోగులు సమన్వయం చేసుకోవాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూతపడిన అగ్రి ల్యాబ్


దుక్కి దున్నుతున్న దృశ్యం


నాడు పండుగ.. నేడు దండగ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పండుగలా వ్యవసాయం సాగింది. ప్రతి సీజన్‌లోనూ అన్నదాతకు వెన్నుదన్నుగా నాటి సర్కారు నిలబడింది. సకాలంలో పెట్టుబడి సాయం అందించింది. ఆధునిక విధానాలపై అవగాహన కల్పించింది. అవసరాలకు అనుగుణంగా విత్తనాలు..ఎరువులు పంపిణీ చేసింది. గిట్టుబాటు ధర దక్కేలా ధాన్యం కొనుగోలు చేసింది. రైతాంగం ఆర్థికాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయం దండగ అనుకునే స్థాయికి రైతులను తీసుకువస్తోంది. పంటల సాగుకు కనీసం మాత్రం కూడా సహకరించకుండా అన్నదాత వెన్ను విరుస్తోంది. ఈ క్రమంలోనే రబీ సీజన్ మొదలైనప్పటికీ జిల్లాలో ప్రధాన పంట వరి సాగుకు చేయూత నందించకుండా దారుణంగా వ్యవహరిస్తోంది.

మొదలైన రబీ సీజన్

- వరి సాగుపై సర్కారు చిన్నచూపు
- భూసార పరీక్షలపై శీతకన్ను
- ఈ–క్రాప్ నమోదుకు చర్యలు శూన్యం
- యూరియా ఎగ్గొట్టేందుకు కుయుక్తులు
- ఎరువుల పంపిణీని పట్టించుకోని వైనం
- ప్రభుత్వ వైఖరిపై రైతుల ఆందోళన

తిరుపతి అర్బన్ : రబీ సీజన్ మొదలైంది. జిల్లావ్యాప్తంగా రైతులు నారుమళ్లు పోస్తున్నారు. దుక్కులు దున్నుకుంటూ భూములను సాగుకు సిద్ధం చేస్తున్నారు. అయితే యూరియాతోపాటు ఎంఓపీ, కాంప్లెక్స్, డీఏపీ, ఎస్ఎస్‌పీ తదితర ఎరువులను ప్రభుత్వం అందిస్తుందా లేదా అనే ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 70వేల ఎకరాల్లో మాత్రమే వరి పంటను సాగుచేశారు. అప్పట్లో యూరియాతోపాటు 80వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరమైనప్పటికీ, సర్కారు కేవలం 53వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అందించింది. ప్రధానంగా 50వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అయితే కేవలం 33వేల మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ చేసింది. దీంతో రైతులు నానా తిప్పలు పడ్డారు. యూరియా కోసం బారులు తీరి పడిగాపులు కాశారు.


ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అగ్రికల్చర్ అధికారులు(ఫైల్)

ఈ–క్రాప్ ఉంటేనే..

రబీ సీజన్‌లో పంటసాగు చేసిన వెంటనే రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ–క్రాప్ చేసుకుంటేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది. అయితే దీనిపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించకుండా సర్కారు నిర్లక్ష్యం వహించింది. దీంతో జిల్లాలో 80శాతానికి మాత్రమే ఈ–క్రాప్ నమోదైంది. మిగిలిన 20శాతం మంది రైతులు ఇక ప్రైవేటు వ్యాపారులకు తమ పంటను సమర్పించుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది.

1.20 లక్షల టన్నులు అవసరం

రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కగట్టారు. ఇందుకు 1.20లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రధానంగా 80 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంటుందని నివేదికలు సిద్ధం చేశారు. ఆ దిశగా ఇప్పటి నుంచే అగ్రికల్చర్ అధికారులు నెలవారీగా ఎరువులను అందుబాటులో పెట్టుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఎరువుల కోసం రైతులు రబీ సీజన్‌లోనూ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అయితే కూటమి ప్రభుత్వంతోపాటు అధికారులు సైతం యూరియాను సమకూర్చుకునే ప్రయత్నం చేయకుండా యూరియా వాడకం తగ్గించాలని మాత్రమే ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీరుపై రైతులు మండిపడుతున్నారు.

అలంకారప్రాయంగా అగ్రి ల్యాబ్‌లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా ఆరు అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువుల నాణ్యతతోపాటు భూసార పరీక్షలకు ఇబ్బంది లేకుండా ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అగ్రిల్యాబ్‌లు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

సలహాలు శూన్యం

ఈ సీజన్‌లో ఏ రకం వరి పంటలు సాగుచేస్తే మార్కెట్‌లో ధరలు ఉంటాయో ముందే రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. గతంలో ఈ పద్ధతినే అధికారులు అమలు చేసేవారు. అయితే ఇప్పుడు సలహాల ఇచ్చే నాథుడే లేరు. పంటలు సాగు పూర్తయిన తర్వాత ఆ రకం ఎందుకు వేశారు. ఈ రకం ఎందుకు సాగు చేయలేదు అంటూ నెపం రైతుల మీదకే నెట్టేస్తున్నారు.

పంటకు యూరియానే ప్రాణం



ప్రధానంగా వరి పంటకు యూరియానే ప్రాణం. జిల్లాలో ఏ రకం వరి సాగుచేసినా యూరియాను వాడాల్సిందే. ప్రధానంగా రబీ సీజన్‌లో యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో వాడకుంటే దిగుబడి తగ్గిపోయి పెట్టిన పెట్టుబడులు అందవు. అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం ముందే గుర్తించాలని కోరుతున్నాం. – మల్లికార్జునరెడ్డి, రైతు, వరదయ్యపాళెం మండలం

అవగాహన కల్పించాలి



ప్రైవేటు వ్యాపారులు రోజు రోజుకు వరి ధాన్యం ధర తగ్గించి కొంటున్నారు. ప్రభుత్వం 100శాతం ఈ–క్రాప్ నమోదు చేయిస్తే రైతులకు మంచిది. అలాగే అగ్రికల్చర్ అధికారులు సీజన్‌కు ముందే ఏ రకం వరి పంట సాగుచేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందో అవగాహన కల్పించాలి. తెగుళ్ల తక్కువగా సోకే రకం, పంట దిగుబడి ఎక్కువగా వచ్చే రకాలను తెలియజేయాలి. – శ్రీనివాసులు, రైతు, వాకాడు మండలం

ఆందోళన అవసరం లేదు



రబీ సీజన్ వచ్చేసింది. ఈ నెలకు అవసరమైన యూరియా సిద్ధంగా ఉంది. ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండే వరి రకం పంటలపై అవగాహన కల్పిస్తున్నాం. నకిలీ విత్తనాల బారిన పడకుండా విత్తనాలకు పరీక్షలు చేయిస్తాం. సకాలంలో ఈ క్రాప్ నమోదు చేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ఏఐ టెక్నాలజీతో బోధన


మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

తిరుపతి సిటీ: ఏఐ టెక్నాలజీతో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలని డీఎస్సీలో ఇటీవల ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్ సూచించారు. తిరుపతిలోని విశ్వం స్కూల్‌లో ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని, డ్రాపవుట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, వర్క్‌షీట్లు, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్లెట్స్ అనుసంధానంగా బోధించాలన్నారు. పాఠశాలలో నిర్వహించాల్సిన రిజిస్టర్లపై సమగ్ర అవగాహనతో శిక్షణ పొందాలని స్పష్టం చేశారు. జిల్లా నోడల్ అధికారి నరసింహులు, స్టేట్ అబ్జర్వర్‌తో పాటు డీవైఈఓ మహేశ్వరరావు, ఎంఈఓలు బాలాజీ, జనార్ధన్ రాజు, ప్రేమలత, అసిస్టెంట్ అలెస్కో మీనాక్షి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి కేడీ సారథి పాల్గొన్నారు.

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట : తలకోన మార్గంలోని పూలకుంటపల్లె వద్ద కారులో తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట అటవీ క్షేత్రాధికారి ఎస్ వెంకటరమణ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా ఎర్రచందనం పట్టుబడినట్టు వెల్లడించారు. పరారవుతున్న నిందితుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితులను తమిళనాడుకు చెందిన చందిరాజన్ ఇజ్మలై, తరుమన్ సామికన్నుగా గుర్తించామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా 11 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వెంకటేశులు (ఫైల్)

వరదయ్యపాళెం : తడ–శ్రీకాళహస్తి రహదారిపై బత్తలవల్లం సమీపంలోని ఇనమాలగుంట అటవీ ప్రాంతం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సత్యవేడు మండలం జడేరి పంచాయతీ కేవీకండ్రిగ గ్రామానికి చెందిన ఎం.వెంకటేశులు (35) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ తడలో నివాసేమున్నాడు.ఈ క్రమంలో పరిశ్రమలో తనతో పని చేస్తున్న మిత్రుడిని కలిసేందుకు వరదయ్యపాళెం వెళ్లాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా అదుపు తప్పి బోల్తాపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశులును సూళ్లూరుపేటలోని ఓ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అక్కడి చికిత్స అందిస్తుండగా మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ సాయిబాబా తెలిపారు.

వీక్లీ ఎక్స్‌ప్రెస్ తిరుచానూరు వరకే

- రేపటి నుంచి టెర్మినల్ మార్పు చేస్తూ తాజా నిర్ణయం
- ప్రయాణికులు గమనించాలని రైల్వేశాఖ ప్రకటన



తిరుచానూరు రైల్వేస్టేషన్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతికి రాకపోకలు సాగిస్తున్న 10 వీక్లీ ఎక్స్ ప్రెస్ రైళ్ల టెర్మినల్‌ను గురువారం నుంచి తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు మారుస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వేశాఖ ప్రకటించింది. ఈ మేరకు ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా రైళ్ల టైమింగ్స్‌లోనూ మార్పులు చేసింది. ఈ నెల 13 నుంచి జల్నా – తిరుచానూరు రైలు (నెంబర్ 07609) ఉదయం రేణిగుంటలో 9.28 గంటకు, తిరుచానూరుకు 10.45 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 13 నుంచి తిరుచానూరు – జల్నా రైలు (నెంబర్ 07610) తిరుచానూరులో మధ్యాహ్నం 3.20 గంటలకి బయలుదేరుతుంది. రేణిగుంటలో 3.35కు చేరుకుంటుంది.

ఈ నెల 15నుంచి చర్లపల్లి – తిరుచానూరు రైలు (నెంబర్ 07251) రేణిగుంటకు ఉదయం 5.58 గంటలకి, తిరుచానూరుకు 8 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 15 నుంచి తిరుచానూరు – చర్లపల్లికి వెళ్లే రైలు (నెంబర్ 07252) తిరుచానూరులో సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంటలో 5.14 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 11 నుంచి నాందేడ్ – తిరుచానూరు రైలు (నెంబర్ 07015) రేణిగుంటకు ఉదయం 10.28 గంటలకు, తిరుచానూరుకు 11.30 గంటలకు చేరుకుంటుంది. తిరుచానూరు – నాందేడ్ రైలు (నెంబర్ 07016) రాత్రి 7.50కి తిరుచానూరులో బయల్దేరి రాత్రి 8.05 గంటలకు రేణిగుంట చేరుకుంటుంది.

ఈ నెల 9 నుంచి సికింద్రాబాద్ – తిరుచానూరు రైలు (నెంబర్ 07009) ఉదయం 8.58 గంటలకి రేణిగుంటకు వచ్చి 10.30కి తిరుచానూరుకు చేరుకుంటుంది. తిరుచానూరు – సికింద్రాబాద్ రైలు (నెంబర్ 07010) సాయంత్రం 4.40గంటలకి తిరుచానూరులో బయల్దేరి 4.55 గంటలకు రేణిగుంట చేరుకుంటుంది. ఈ నెల 12 నుంచి చర్లపల్లి–తిరుచానూరు రైలు (నెంబర్ 07017) ఉదయం 8.58 గంటలకు రేణిగుంటకు చేరుకుని, 11.15గంటలకు తిరుచానూరు వెళ్తుంది. తిరుచానూరు – చర్లపల్లి రైలు (నంబర్ 07018) సాయంత్రం 4.40 గంటలకి తిరుచానూరులో బయలుదేరి 4.55గంటలకు రేణిగుంటకు చేరుకుంటుంది. ఇతర స్టేషన్లలో మాత్రం ఈ రైళ్ల సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవు.

నారావారి నకిలీ సారా!

- విచ్చలవిడిగా నకిలీ మద్యం తయారుచేస్తున్న కూటమి నేతలు
- రాష్ట్రమంతా బెల్టు షాపులకు, మద్యం దుకాణాలకు సరఫరా
- ఆ ఒక్క హామీని నెరవేర్చిన చంద్రబాబు నాయుడు
- జిల్లాకు ఓ మెడికల్ కాలేజి కావాలని జగన్ అన్నారు
- జిల్లాకో నకిలీ మద్యం కేంద్రం తెస్తామంటున్న చంద్రబాబు
- వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర నేత చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మదుసూధన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీల్లో తక్కువ ధరకు మద్యం అనే హామీని మాత్రం చంద్రబాబు నెరవేర్చారని వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రం సంధించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యం, బెల్టు షాపులకు అవకాశం లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడిపిందన్నారు. అయితే ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తక్కువ ధరకు మద్యం సరఫరా చేస్తామంటూ విచ్చిలవిడిగా కూటమి నేతలు నకిలీ మద్యం తయారీ కేంద్రాలు నెలకొల్పారన్నారు. కొన్ని నెలల క్రితం తిరుపతి దామినేడు వద్ద నకిలీ మద్యం తయారీ ముఠా బయటపడితే, మొన్న అన్నమయ్య జిల్లాలో టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి తయారుచేయిస్తున్న నకిలీ మద్యం కేంద్రం ములకల చెరువులో వెలుగుచూసిందన్నారు. తాజాగా నిన్న ఇబ్రహీంపట్నంలో మరో కేంద్రం బయటపడిందన్నారు.

బెల్టు షాపులకు, మద్యం దుకాణాలకు సరఫరా

గతంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను ప్రయివేటు పరం చేసి నేడు కూటమి నేతలు తయారుచేసిన నకిలీ మద్యాన్ని బెల్టు షాపులకు, వైన్‌షాపులకు రాష్ట్రమంతా సరఫరా చేస్తున్నారని మధుసూదన్ రెడ్డి విమర్శించారు. అసలు మద్యం వ్యాపారాన్ని ప్రయివేటు పరంచేసిందే నారావారి నకిలీ మద్యం సరఫరా కోసమే అని ఆరోపించారు. ఇంత జరిగినా ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గానీ, హోంమంత్రి అనిత గానీ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన హోంమంత్రి నేడు నారావారి నకిలీ మద్యంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు.

'పచ్చ' పత్రికలో నీచమైన రాతలు

నకిలీ మద్యం సూత్రధారి, టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అనే వ్యక్తి పెద్దిరెడ్డి కోవర్టని పచ్చ పత్రికలో రాయడం విడ్డూరమని చిందేపల్లి మండిపడ్డారు. నకిలీ మద్యం తయారుచేస్తూ అడ్డంగా దొరికిన తర్వాత పెద్దిరెడ్డి అనుచరుడు అంటూ నీచమైన రాతలు రాయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

యువగళం హామీ ఏమైంది?

రాష్ట్రంలోని 13 లక్షల మంది ఆటో కార్మికులకు, టిప్పర్ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన వారికి సైతం రూ.15 వేలు రూపాయలు ఇస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ బాహాటంగా ప్రకటించారని గుర్తుచేశారు. నేడు గత ప్రభుత్వం అమలు చేసిన వాహన మిత్ర పేరు మార్చి ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా వారికి నగదు బదిలీ పూర్తిస్థాయిలో అమలుచేయక మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో నేడు బహిర్గతమైన కల్తీ మద్యంపై సీఎం చంద్రబాబు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ జగన్ సంకల్పం

– జిల్లాకో నకిలీ మద్యం తయారీ కేంద్రమే బాబు లక్ష్యం

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాకో మెడికల్ కాలేజీ కట్టించి అనుబంధంగా ఓ ఆస్పత్రి నెలకొల్పాలని సంకల్పించారని చిందేపల్లి చెప్పారు. అయితే నేడు చంద్రబాబు మాత్రం ప్రతి జిల్లాకు ఓ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేసి రాష్ట్రంతా సరఫరా చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నారని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కార్పొరేట్లకు పీపీపీ పద్ధతిలో కట్టబెట్టడం దుర్మార్గమన్నారు.

సీజేఐపై దాడికి యత్నంపై ఖండన

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది దాడికి ప్రయత్నించడాన్ని వైఎస్‌ఆర్‌సీపీ ఖండిస్తోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు గోపాల్‌రెడ్డి, వెంకటాచలపతి పాల్గొన్నారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి


మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది(ఇన్‌సెట్) ఉదయ్‌కుమార్ (ఫైల్)

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఎల్‌ఏ సాగరం బీడీ కాలనీ సమీపంలో ఓ వ్యక్తి స్వర్ణముఖి నదిలో మునిగిపోయి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం వెలుగుచూసింది.వివరాలు.. కాలనీకి చెందిన కుదిరి ఉదయ్‌కుమార్ (35) సోమవారం సాయంత్రం స్నానం చేసేందుకు నదికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నది ఒడ్డున ఉదయ్‌కుమార్ దుస్తులను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని అగ్నిమాపకశాఖ అధికారుల సాయంతో నదిలోని గుంతలో కూరుకుపోయిన ఉదయ్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చమూక దర్జా.. ప్రభుత్వ భూముల కబ్జా!

- అధికారుల తీరుపై గ్రామస్తులు ఆందోళన
- అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఆరోపణ


అటవీ భూమిని చదును చేసిన దృశ్యం

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లె మండలంలోని గొల్లగుంట చెరువు పొరంబోకు, చిలమనూరు పంచాయతీ గల్లగుంట వద్ద అటవీశాఖ భూములను టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఆక్రమణకు అటవీశాఖ అధికారులే సాయం చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాలు.. వెంకటగిరి– నాయుడుపేట రహదారి సమీపంలోని ఈ భూములపై పచ్చమూక కన్ను పడింది. వెంటనే ఆ భూములను చదును చేసేసింది. దీనిపై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.సుమారు 20 ఎకరాల అటవీ భూమిని కబళించినా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ క్రమలంటనే ఎమ్మెల్యే అనుచరుడిగా చెప్పుకునే ఓ వ్యక్తి ఆక్రమిత భూమికి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

ఆక్రమించి.. బోరు వేసి..!


కబ్జా చేసిన భూమిలో వేసిన బోరు

తొట్టంబేడు : స్థానిక ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో రిలయన్స్ పెట్రోల్‌బంకు వెనుక వైపు సర్వే నంబరు 152లో 1.22ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఆ భూమిని జేసీబీతో చదును చేయడం, అందులో బోరు వేయిస్తున్న దృశ్యాలు మంగళవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై తొట్టంబేడు తహసీల్దారు భారతి మాట్లాడుతూ ఆక్రమిత భూమిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అత్యంత ఖరీదైన ఈ భూమిని కబ్జాకోరల్లో నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

10న రెండో విడత సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, టీటీడీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో రెండవ విడత అడ్మిషన్ల వెబ్ ఆప్షన్ల మార్పులకు సంబంధించిన ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. దీంతో ఉన్నత విద్యామండలి ఓఏఎండీసీ ద్వారా రెండవ విడతలో సీట్లు సాధించిన విద్యార్థులకు 10వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు సాధించిన విద్యార్థులకు వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపనున్నారు. ఆయా కళాశాలల్లో ఈ నెల 11 నుంచి 13వ తేదీలోపు ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి వర్క్‌షాప్

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో బుధవారం నుంచి రెండు రోజులపాటు జాతీయ సహకార మంత్రిత్వశాఖ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సహకారం రంగం బలోపేతం, వివిధ పథకాల అమలుపై సమీక్షించేందుకు త్రైమాసిక సమావేశం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ సహకార మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆశిష్ కుమార్ భుటానీ, ఏపీ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ పాల్గొననున్నట్లు వివరించారు.